# బలవంతపు తొలగింపును వ్యతిరేకిస్తూ, మౌలిక భూ సంస్కరణల కోసం అసోం ప్రజల పోరాటం

**2016** మేలో అసోంలో బిజెపి అధికారం లోకి వచ్చినప్పటినుండి నిర్బంధం, మతతత్వ విభజనలనే రెండు ఆయుధాలను ఉపయోగిస్తూ సాధారణ ప్రజల హక్కులను అణచివేస్తూ, అసోంలోని విశాల భూఖండాలను, విలువైన సహజ వనరులను విదేశీ బహుళజాతి కంపెనీలు, దేశంలోని బడా కార్పొరేటు కంపెనీలు హస్తగతం చేసుకునేందుకు, భూములపై వారే అదుపు కలిగి వుండేందుకు వీలు కల్పిస్తోంది. గత సంవత్సర కాలంగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు దీనికి అద్దం పడుతున్నాయి.

రాష్ట్రంలో 'ఎయిమ్స్' నిర్మాణానికి కేటా యించిన స్థలాన్ని బదలాయించటాన్ని వ్యతిరేకిస్తూ రాహాలో ప్రజలు నిరసనలు తెలియజేస్తున్నారు. 2016 జులై 15న, రాహాలో జరిగిన ఒక ఆందోళనపై పోలీసులు జరిపిన కాల్పులలో మింటూ దుయేరి అనే ఓ 25 ఏళ్ళ యువకుడు మరణించాడు. కజిరంగా జాతీయ ఉద్యాన వనానికి దగ్గరలోనున్న బందేర్‌దూబి గ్రామంలో ప్రజలు, తమ నుండి స్వాధీనం చేసుకున్న భూములకు తగిన పరిహారాన్ని, ప్రజలందరి పునఃస్థాపనను డిమాండ్ చేస్తున్నారు. 2016 సెప్టెంబర్ 19న వీరి ఆందోళనపై కాల్పులు జరిపిన పోలీసులు అంజుమా ఖాటూన్, ఫక్రుద్దీన్‌లనే ఇద్దరిని కాల్చి చంపారు. 'క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి', 'ఆల్ అస్సామ్ మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్'ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరుగుతుండగా పోలీసులు ఈ కాల్పులు జరిపారు.

బందేర్ దూబీలో విస్థాపనకు గురైన 198 కుటుంబాలలో దాదాపు 40 కుటుంబాల ప్రజలు, తప్పనిసరి పరిస్థితుల్లో తమ బంధువుల ఇళ్ళలో తలదాచుకోవలసి వచ్చింది. మిగిలిన కుటుంబాల ప్రజలు 'బాగ్‌మరి' గ్రామంలో చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ చెట్లనీడనే తలదాచుకున్నారు. ఈ ప్రజలంతా ప్రధానంగా ముస్లిములు; వీరంతా ఒక అర్ధశతాబ్దిపైగా కాలం క్రితం పూర్వపు తూర్పు బెంగాల్ రాష్ట్రం నుండి వచ్చి బందేర్ దూబి గ్రామంలో స్థిరపడ్డారు. వీరిలో నుండి ప్రభుత్వం ఏడు హిందూ కుటుంబాలను రక్షిత స్థానానికి తరలించింది కానీ, ఇతర కుటుంబాల గురించి పట్టించుకోలేదు. మతతత్వ పూరిత వివక్షకు ఇది ఒక స్పష్టమైన ఉదాహరణ.

తొలగింపు ప్రక్రియ తర్వాత 'దేశం, భూమి, ఇల్లు' అంశాలపై ప్రభుత్వం ఎప్పటికీ రాజీ పడబోదని అసోం ప్రభుత్వంలో మంత్రి అయిన హిమంత బిశ్వశర్మ తమ ప్రభుత్వ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో పేర్కొన్నాడు. బిజెపి ప్రభుత్వం అసోం ప్రజలను – అస్సామీయులు, చొరబాటు దారులుగా విభజించి, ముస్లిమ్ మతస్థులను అనిశ్చితమైన, అభద్రతతోకూడిన, విషాదకరమైన పరాధీన స్థితికి నెట్టి, అణచివేతకు సులభ లక్ష్యాలుగా మలుస్తోంది.

ఒక సంగరం క్రితం, అసోంలోని బిజెపి ప్రభుత్వం 'చట్ట విరుద్ధ ఆక్రమణదారులు'గా పేర్కొంటూ ప్రభుత్వ భూముల నుండి ప్రజలను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. కజిరంగాతో ప్రారంభమై, అతిత్వరగా ఇది రాష్ట్ర వ్యాపితంగా విస్తరించింది. దాదాపు సంగరం తర్వాత, 2017 నవంబర్ 24న సైపాజ్‌హార్‌లో ప్రభుత్వం తన తొలగింపు చర్యను చేపట్టింది. ఇక్కడ, కురువ గ్రామానికి చెందిన ఆనందదాస్ అనే యువకుడు అర్థంకాని విధంగా నవంబర్ 21న అపహరణకు గురై నవంబర్ 23న హత్యకు గురయ్యాడు. అయితే, గంధియ పత్తర్ గ్రామస్థు లను చట్టవిరుద్ధ వలసదారులుగా ఆరోపిస్తూ, ఆనందదాస్ హత్యకు వారే బాధ్యులంటూ ఆయుధాలతో కూడిన ఒక గుంపు వినాశనం సృష్టించింది. వారు కొన్ని ఇళ్ళను లూటీ చేశారు; కొన్ని ఇళ్ళను తగులబెట్టారు. నాటకీయంగా 2017 నవంబర్ 24న తక్షణం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకునే పేరిట కదలి, దాదాపు 60 కుటుంబాలను వారి భూముల నుండి బలవంతంగా తొలగించింది.

సిఫాఝర్‌తో బలవంతపు తొలగింపుల ప్రక్రియ ఆగలేదు. 2017 నవంబర్ 27న గౌహతి చుట్టూ తానున్న ఆమ్‌ఛాంగ్ రిజర్వు అటవీ భూములను చుట్టబెట్టారు. చట్టవిరుద్ధ చొరబాటుదార్లుగా పేర్కొంటూ 700 కుటుంబా లను అటవీ భూముల నుండి తొలగించారు. హైకోర్టు ఆదేశం పేరుతో సిఫాఝర్‌తో తొలగింపులు చేబట్టగా, భజరంగ్‌దళ్ కార్యకర్తల డిమాండ్ మేరకు ఆమ్‌ఛంగ్ తొలగింపులు నిర్వహించారు. ఆమ్‌ఛంగ్ తొలగింపులు అసోమ్ సమాజంలోని వివిధ సెక్షన్ల వ్యతిరేకతను చూరగొన్నాయి. ఈ తొలగించబడినవారంతా అధికంగా మిషింగ్ మరియు బోడో తెగలకు చెందినవారేగాక, వీరు మజౌలీ, లక్ష్మీపూర్ ధేమాజీలలో నదీ కోత కారణంగా ఒక పర్యాయం భూములు కోల్పోయినవారే. తొలగించిన వారందరినీ పునరావాసం, కనీసపాటి నీడ లేకుండా వదిలివేశారు.

చట్టవిరుద్ధ చొరబాటుదారులుగా సిపాఝర్ గ్రామస్తులను చిత్రించి, తాము చేపట్టిన చర్య సమర్థనీయమైనదిగా పాలకులు పేర్కొంటున్నారు. అయితే, దాదాపు వారంతా ఆసోమ్‌లో చట్ట బద్ధమైన పౌరులుగా, ఓటర్ గుర్తింపు కార్డులను కూడా కలిగివున్నారు. బార్‌పేటలోని జోనియా వంటి ప్రాంతాల నుండి పేదరికం, నదీకోతల నుండి తప్పుకునేందుకు వీరి ముందు తరాల వారు ఇక్కడకు తరలివచ్చారు. తర్వాతి కాలంలో ఈ ప్రజలను మోసంచేసి కురువాలోని స్థానికులు ప్రభుత్వ భూములను వీరికి విక్రయించారు. ప్రస్తుత పాలకపార్టీ 2016 ఎన్నికలలో వారి ఓట్లను వేయించుకుంది. ఈ ప్రజలు భూములపై తమ హక్కు గురించి ప్రశ్నించేసరికి, అదే ప్రజలను ఈ పాలకులే చట్టవిరుద్ధ చొరబాటు దారులని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా బలవంతంగా వారి భూములనుండి తొలగించారు.

ఆమ్‌ఛాంగ్ తొలగింపుల సమస్యకొస్తే, తరాల నుండి ఆదివాసీ ప్రజలు ప్రకృతితో కలసి మెలసి జీవిస్తూ, తమ మనుగడ సాగిస్తున్నారు. అయితే, అడవిని విధ్వంసం చేస్తున్నవారిగా, వారిపై ఆరోపణలు చేస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారనే ఆరోపణతో ప్రభుత్వం ఈ ఆదివాసులను భూముల నుండి తొలగించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2017 మే ఉత్తర్వుల ప్రకారం, ప్రజలను తొలగించిన కొన్ని గ్రామాలు రెవిన్యూ గ్రామాలుగా వున్నాయి. సున్నిత పర్యావరణ గ్రామాలుగా వాటిని గుర్తించారు. కానీ ఆ గ్రామాలు రిజర్వు ఫారెస్టులో భాగంగా వున్నాయి. ప్రభుత్వమే ఆమోదించిన ప్రకారం, 2004లో రిజర్వు ఫారెస్టుగా ప్రభుత్వం ప్రకటించటానికి చాలా ముందుగానే ఆమ్‌ఛాంగ్ లోని కొన్ని ప్రాంతాలలో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. అయితే, చట్టాలను కాలదన్ని నిర్మించిన వాణిజ్య సముదాయాలు, సిమెంటు పరిశ్రమలు, సైనికుల ఫైరింగ్ రేంజి మొదలైన వాటిని రిజర్వ్ ఫారెస్టులోనే కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

విదేశీ పరిశ్రమలకు, భారత బడా కార్పొరేటు సంస్థలకు భూములను కట్టబెట్టే తమ విధానంలో భాగంగానే ప్రభుత్వం పెద్దఎత్తున ప్రజలను విస్థాపనకు గురిచేస్తోంది. గౌహతీ లోనూ, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి ప్రజలను తొలగిస్తోంది. ఎదుగుతోన్న వ్యూహాత్మక భౌగోళిక పారిశ్రామిక మరియు రవాణా సౌకర్యాల కేంద్రంగా దీని ద్వారా పొరుగు రాష్ట్రాలకు వస్తువులను, సేవలను అందించే ద్వారంగా పాలకులు గౌహతిని పరిగణిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం యొక్క విస్తృత ప్రైవేటీకరణ విధానంలో ఒక భాగం మాత్రమే. ఈ విధానాన్ని సుగమం చేసేందుకే ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బహుళజాతి కంపెనీలకు, భారత బడా కార్పొరేటు సంస్థలకు భారీ భూఖండాలను కట్ట బెట్టేందుకు మార్గాన్ని సులభతరం చేయటంలో ఇది మొదటి అడుగు మాత్రమే. భూసేకరణకు ప్రతిఘటన ఎదరౌతూ ప్రక్రియ కష్టతరమైందిగా కొనసాగుతోంది. కనుక, ఒక ప్రాంతపు ప్రజానీకంపై అక్రమ చొరబాటుదారులని, చట్టవిరుద్ధ ఆక్రమణదారులని ముద్రవేసి, మతతత్వశక్తులను ఎగదోసి, ప్రజలకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను రెచ్చగొట్టటం, అసోంలో ప్రజలను విభజించి పాలించే బిజెపి పాలకుల క్రీడలో ఒక భాగం మాత్రమే. ప్రజలలో ఒక విభాగపు ప్రజలను మరో విభాగంపైకి ఉసిగొల్పి, వారి పోరాటాన్ని బలహీనపర్చి, క్రూర నిర్బంధాన్ని ప్రయోగించి మరింత తేలికగా తొలగింపు ప్రక్రియను పూర్తి చేయడమేగాక, విస్థాపనకు గురైన ప్రజలకు సరైన పరిహారం, పునరావాసం కల్పించాల్సిన తమ బాధ్యత నుండి కూడా తప్పుకుంటున్నారు.

పర్యావరణ వనరుల పరిరక్షణ గురించి అసోమ్ పాలకులు చాలా ఎక్కువగా మాట్లాడు తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో బహిరంగ గనుల తవ్వకానికి ఆమోదించి, పట్కాయి కొండలను వారు దాదాపు విధ్వంసం చేశారు. రభా హసోంగ్ స్వయంప్రతిపత్తి మండళ్ళను మరియు బిటిఏడి పరిధిలోని ఛిరాంగ్ ప్రాంతాల నుండి పెద్దఎత్తున పారిశ్రామిక కలప అవసరాల కోసం, కలప సేకరణను వారు అనుమతించారు. పెద్ద మొత్తంలో గిరిజన ప్రాంతాలలోని భూ ఖండాలను పతంజలి, దాబర్ మొదలైన సంస్థలకు అప్పగించారు. పిడికెడుమందిగావున్న బడా వ్యాపారవర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు, అభివృద్ధిపేరుతో కోట్లాదిమంది పేదలను ఆకలికి, పేదరికానికి గురిచేస్తూ, వారిని దోచుకుంటు న్నారనేది స్పష్టం. ఒకవైపున బహుళజాతి కంపెనీలు, బడా వ్యాపారవర్గాలు అనంతంగా, భారీగా ప్రజల జీవనోపాధిని, జీవనాధారాలను కొల్లగొడ్తూ భారీగా భూములు కైవసం చేసుకోవటానికి ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. మరోవైపున ప్రతి సం॥రం నదీ ప్రవాహపు కోతలకు గురై ముంపు కారణంగా పెద్దసంఖ్యలో ప్రజానీకం రాష్ట్రానికి చెందిన ఒక పెద్ద భూభాగంలో భూములు, నివాసం కోల్పోతున్నారు. ప్రజల భూముల దురాక్రమణకు పాల్పడుతూ, ప్రజలను వారి భూముల నుండి గెంటివేసి, వారి జీవనోపాధిని కొల్లగొట్టి సామ్రాజ్యవాదులకు బడా వ్యాపారవర్గాలకు కట్టబెడుతున్నారు. కనుక దీనికి వ్యతిరేకంగా, విప్లవాత్మక భూ సంస్కరణల కోసం, ప్రజాస్వామిక, జాతీయ, ప్రజానుకూల అభివృద్ధి విధానం కోసం పోరాడటం – ప్రజల ముందున్న తక్షణ, అత్యావశ్యక కర్తవ్యం.

ooooo